RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్ ప్రెస్

తెలుగు దిన పత్రిక


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

అవసరాన్ని బట్టి యాదుకొనుమెపుడు
వ్యయముసేయబోకు వ్యర్థ ముగను
ధనము విలువ తెలిసి దానమీయ వలయు
పలితముండు వినుము వసుధపైన

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 225 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 28-11-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


## ఓటు హక్కుకు ఆధార్ ధ్రువీకరణ కాదు

- ఎస్ఐఆర్' సమర్ధనీయమే - సిజెఐ వ్యాఖ్యలు
- పిటిషన్లపై విచారణ 2కు వాయిదా



**న్యూఢిల్లీ నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** వయోజన ఓటు హక్కు పొందేందుకు ఆధార్ ధ్రువీకరణ పత్రం కాబోదని, అది కేవలం సంక్షేమ పథకాల అమలు కోసం ఏర్పాటు చేసింది మాత్రమేనని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కసరత్తుపై ఎన్నికల సంఘం (ఇసి) నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోరుమల్యా బాగ్చి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా

-మిగతా 2 లో

## సైకిల్‌పై రాకెట్ మోసుకెళ్లే స్థితి నుంచి ఎదిగాం

- స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ ప్రారంభం
- అంతరిక్షంలో ఇది ఒక గొప్ప మైలురాయి
- భారత యువశక్తి నైపుణ్యానికి స్కైరూట్ గొప్ప ప్రతీక
- భారత అంతరిక్ష రంగం భవిష్యత్తులో మరిన్ని ఘనతలు సాధిస్తుంది
- "ఈ విజయం భారత యువశక్తికి స్ఫూర్తినిస్తుంది



**న్యూఢిల్లీ నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** శంషాబాద్‌లో స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్‌ను ప్రధాని మోడీ వర్చువల్‌గా ప్రారంభించారు. తొలి ప్రయివేటు కమర్షియల్ రాకెట్ విక్రమ్-1ను ఆవిష్కరించారు. స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ దేశంలోనే అతిపెద్ద ప్రయివేటు రాకెట్ ఫ్యాక్టరీ కావడం విశేషం. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. స్కైరూట్ బృందానికి అభినందనలు తెలిపారు. అంతరిక్షంలో ఇది ఒక గొప్ప మైలురాయి అని పేర్కొన్నారు. భారత యువశక్తి నైపుణ్యానికి స్కైరూట్ గొప్ప ప్రతీక అని పేర్కొన్నారు. భారత అంతరిక్ష రంగం భవిష్యత్తులో మరిన్ని ఘనతలు సాధిస్తుందని తెలిపారు. "ఈ విజయం భారత యువశక్తికి స్ఫూర్తినిస్తుంది. సైకిల్‌పై రాకెట్ మోసుకెళ్లే స్థితి నుంచి మన ప్రస్థానం ప్రారంభమైంది.

-మిగతా 2 లో



## ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ ఓఎస్డీ

- విచారించిన సిట్..
- రెండు గంటల పాటు ప్రశ్నలు

**హైదరాబాద్ నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశమైన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇన్నాళ్లు స్తబ్దుగా ఉన్న సిట్ మళ్లీ విచారణ ప్రారంభించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఓఎస్డీ రాజశేఖర్‌రెడ్డిని పోలీసులు విచారిం చారు. జూబ్లీహిల్స్ పీఎస్ లో గురువారం అతన్ని రెండు గంటల పాటు ప్రశ్నించారు. ఇటీవల హైదరాబాద్ సీపీగా బాధ్యతలు చేపట్టిన సజ్జనార్.. ఫోన్ ట్యాపింగ్ కేసుపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కేసు విచారణ ఏ దశలో ఉంది? ఇప్పటి వరకు దాఖలు చేసిన ఛార్జ్‌షీట్లు తదితర అంశాలపై ఆరా తీశారు. కేసు విచారణపై దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలోనే కేసీఆర్ ఓఎస్డీని విచారించినట్టు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితులు, నిందితులను

-మిగతా 2 లో

# మూడు రీజియన్లుగా రాష్ట్రాభివృద్ధి


### చైనా, జపాన్‌ల స్థాయే లక్ష్యం

- కొత్త రంగాల్లో, కొంగొత్త మార్గాల అన్వేషణ
- మన యువత ప్రపంచంతోనే పోటీపడాలి
- అభివృద్ధిని ప్రతిబింబించేలా తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




**హైదరాబాద్ నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ ఉండకూడదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆ మేరకు తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాలని ఆయన ఉన్నతాధికారులను ఆదేశించారు. అది వాస్తవిక దృక్పథాన్ని ప్రతిబింబించేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధిని మూడు రీజియన్లుగా విభజించాలని కోరారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్), పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ (ప్యూర్), రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ (రేర్)గా వాటిని విభజించాలని దిశా నిర్దేశం చేశారు. వీటితోపాటు రాష్ట్రాభివృద్ధిని ప్రతిబింబించేలా 'తెలంగాణ రైజింగ్-2047 పాలసీ

-మిగతా 2 లో



## వైట్‌హౌస్ వద్ద కాల్పులు

- ఇద్దరు నేషనల్‌గార్డ్స్ మృతి..
- ట్రంప్ ఆగ్రహం

**వాషింగ్టన్**

అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో వైట్‌హౌస్‌కు అతి సమీపంలో జరిగిన కాల్పులు కలకలం సృష్టించాయి. శ్వేత సౌధానికి కొన్ని అడుగుల దూరంలో జరిగిన కాల్పుల్లో ఇద్దరు వెస్ట్ వర్జీనియా నేషనల్ గార్డ్స్ సభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. గాయడిపన గార్డ్స్ మొదట మరణించినట్టు ప్రకటించారు. ఆ తర్వాత ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్, వాషింగ్టన్ మేయర్ మురియల్ బౌజర్ తెలిపారు. ఈ దాడి ఒక పక్కా ప్రణాళికతో కూడిన దాడిగా మేయర్ అభివర్ణించారు. ఇది పక్కాగా నేషనల్ గార్డ్‌ను లక్ష్యంగా చేసుకున్న దాడిగా స్పష్టం చేశారు. దాడిచేసిన వ్యక్తి శ్వేత సౌధానికి సమీపంలోని మూల మలుపు తిరగగానే గార్డ్స్‌పై కాల్పులు జరపడం ప్రారంభించాడని పోలీస్ చీఫ్ జెఫ్రీ కారోల్ వెల్లడించారు. కాల్పులు జరిగిన వెంటనే సమీపంలో ఉన్న ఇతర నేషనల్ గార్డ్ సభ్యులు అలర్ట్ అయ్యారు. వెంటనే కాల్పులు జరిగిన ప్రదేశంలోకి పరుగెత్తుకు వచ్చి, కాల్పులు జరిపిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని పట్టుకునే క్రమంలో ఇరు వర్గాల మధ్య కాల్పులు జరిగాయి. అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడికి కూడా కాల్పుల్లో గాయాలయ్యాయని, అయితే అవి ప్రాణాపాయం కలిగించేవి కావని పోలీసులు చెబుతున్నారు. అయితే ఈ దాడిలో ఒకరు పాల్గొన్నారా? ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

-మిగతా 2 లో

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్రం ఆమోదించాలి

### ప్రధాని సమయమిస్తే సీఎం నాయకత్వంలో ఢిల్లీకి వస్తాం

- 9వ షెడ్యూల్‌లో చేర్చేలా రాజ్యాంగ సవరణ జరగాలి
- పార్లమెంటు సమావేశాల్లో ప్రత్యేకంగా చర్చకు తేవాలి
- రాజకీయాలకతీతంగా రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కృషిచేయాలి
- ఎంపీల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్ నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** ప్రధానమంత్రి నరేంద్రమోడీ సమయమిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఢిల్లీకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బీసీలకు సంబంధించిన 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. తొమ్మిదో షెడ్యూల్ చేర్చేందుకు రాజ్యాంగ సవరణ జరగాలని చెప్పారు. తెలంగాణకు చెందిన ఎంపీలు పార్లమెంటు సమావేశంలో

-మిగతా 2 లో

## ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ కష్టమే..!

- ఐఎంఎఫ్ అంచనా
- రూపాయి పతనంతో దెబ్బ
- లక్ష్యాన్ని చేరడానికి మరో ఏడాది పట్టొచ్చు



**వాషింగ్టన్ -** భారత ఆర్థిక వ్యవస్థ అనుకున్న సమయంలో 5 ట్రిలియన్ డాలర్లకు చేరడం కష్టమేనని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) స్పష్టం చేసింది. ఆ స్థాయికి చేరడానికి గతంలో అంచనా వేసిన దానికంటే ఎక్కువ సమయం పట్టవచ్చని విశ్లేషించింది. అంచనాల కంటే తక్కువ జిడిపి వృద్ధి చోటు చేసుకోవడంతో పాటుగా అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి మారకం విలువ పతనం ఆర్థిక వ్యవస్థకు ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి. ఆర్థిక సంవత్సరం 2027-28 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లకు చేరనుందని 2025 ఫిబ్రవరిలో తొలుత వేసిన అంచనాలను ఐఎంఎఫ్ తాజాగా సవరించింది. ఈ లక్ష్యం మరో ఏడాది ఆలస్యమై 2028-29 నాటికి నెరవేరొచ్చని విశ్లేషించింది. ఐఎంఎఫ్ రిపోర్ట్ వివరాలు.. 2025-26 నాటికి 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ నమోదు కావొచ్చని అంచనా. 2027-28 మార్చి ముగింపు నాటికి 4.96 ట్రిలియన్ డాలర్లుగా ఉండొచ్చు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో జిడిపి 6.6 శాతంగా, వచ్చే ఏడాది 2026-27లో 6.2 శాతం వృద్ధి ఉండొచ్చు. డాలర్‌తో రూపాయి మారకం

-మిగతా 2 లో

# నామినేషన్ల పర్వం షురూ

### రేపే నామినేషన్లకు చివరి రోజు




- తొలిరోజు మందకొడిగా దాఖలు
- సర్పంచ్ స్థానాలకు 3,242..వార్డులకు 1,821
- అత్యధికంగా నల్లగొండలో 421
- అత్యల్పంగా ములుగులో 22

**హైదరాబాద్ నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్ల నామినేషన్ల ప్రక్రియ మొదటి రోజు మందకొడిగా సాగింది. తొలి రోజు నామినేషన్లు దాఖలు చేయడానికి ఆశావహులు అంతగా ఆసక్తి చూపలేదు. ఇంకా రెండు రోజులు గడువుండటంతో పాటు నామినేషన్ వేయడానికి కావాల్సిన డాక్యుమెంట్లను సమకూర్చుకోవడం తదితర అంశాలపైనే అభ్యర్థులు దృష్టి పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడుతలో 4,236 సర్పంచ్ స్థానాలకు

-మిగతా 2 లో

## అమరావతే గ్రోత్ ఇంజన్

- రెండోదశ ల్యాండ్ పూలింగ్‌కు సహకరించండి
- రాజధానిగా గుర్తించాలని కేంద్రాన్ని కోరతాం
- రైతులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**అమరావతి నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** : అమరావతే రాష్ట్రానికి గ్రోత్ ఇంజన్‌గా ఉండాలని, రాజధాని అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సచివాలయంలో రాజధాని రైతులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని రైతులకు న్యాయం చేయడం తన బాధ్యత అని అన్నారు. ఇక్కడ జరిగిన అభివృద్ధి ఫలాలను రాజధాని రైతులే ముందు అందుకోవాలని చెప్పారు. రాజధానిలో రెండో విడత ల్యాండ్ పూలింగులో

-మిగతా 2 లో

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక

శుక్రవారం 28 నవంబర్ 2025

# ఓటు హక్కుకు ఆధార్ ధ్రువీకరణ కాదు

మొదటి తరువాయి

పౌరసత్వానికి ఆధార్ ధ్రువీకరణ పత్రం కాదని స్పష్టం చేసింది. 'ఆధార్ సామాజిక సంక్షేమ ప్రయోజనాలు అందరికీ చేరేలా చూసుకోవడానికి ఏర్పాటుచేసింది మాత్రమే. రేషన్ కోసం ఆధార్ పొందిన వ్యక్తిని.. ఓటర్‌ను చేయాలా? విదేశాలకు చెందినవారు ఇక్కడ కార్మికుడిగా పనిచేస్తే.. వారికి కూడా ఓటు హక్కు కల్పించాలా?' అని ధర్మాసనం ప్రశ్నించింది. ఓటరు నమోదు ఫారం-6లో పేర్కొన్న వివరాలు సరైనవో, కావో నిర్ధరించుకునే అధికారం ఇసికి ఉందని పేర్కొంది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో సర్ నిర్వహించడాన్ని ప్రత్యేకంగా సవాల్ చేసిన పిటిషన్ల విచారణకు సుప్రీం షెడ్యూల్ చేసింది. డిసెంబరు 1లోపు వీటిపై స్పందన తెలియజేయాలని ఇసిని ఆదేశించింది. తరువాత తదుపరి విచారణను డిసెంబర్ 2కి ధర్మాసనం వాయిదా వేసింది.

పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ..ఎస్ఐఆర్ ప్రక్రియ సాధారణ పౌరులపై రాజ్యాంగ విరుద్ధమైన భారాన్ని మోపుతుందన్నారు. దీనివల్ల నిరక్షరాస్యులు తమ ఓటు హక్కు కోల్పోయే ప్రమాదముందన్నారు. ఈ మొత్తం ప్రక్రియ ప్రజాస్వామ్యాన్ని ప్రభావితం చేస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. అలాగే ఒక వ్యక్తికి మానసిక స్థితి సరిగా లేకపోతే బిఎల్‌వో తీర్పు చెప్పగలరా? చట్టం పరిధికి వెలుపల ఉన్న అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు ఈ హక్కును నిర్ణయించ కూడదు. అందుకే ఇది అసమంజసమైనదని కపిల్ వాదించారు.

పిటిషనర్ల తరపున మరో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపిస్తూ ఆర్టికల్ 324 నుండి ఎన్నికల సంఘం తీసుకున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో కొన్నింటికి అనుమతి లేదని, అధికార పరిధి లేదని వాదించారు. దీనికి సిజెఐ సూర్యకాంత్ జోక్యం చేసుకుని ఎన్నికల సంఘానికి ఎప్పటికీ ఎస్ఐఆర్ అధికారం ఉండదా? అని ప్రశ్నించారు. ఇది సాధారణ నవీకరణ కాదని, ప్రత్యేక సవరణ జరుగుతుందని అన్నారు. అందుకే ఈ ప్రక్రియను సమర్థించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. దీనికి సింఘ్వి బదులు ఇస్తూ గత ఆరు నెలల్లో ఎస్ఐఆర్ ప్రక్రియకు ఈ కోర్టు చాలా మెరుగులు దిద్దిందని, కానీ చట్టం కానిది చట్టంగా మిగిలిపోయిందని అన్నారు. ఎస్ఐఆర్ వంటి ఏ ప్రక్రియనైనా నిర్వహించే ముందు రాజ్యాంగాన్ని అనుసరించాలని సింఘ్వీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

## సైకిల్‌పై రాకెట్ మోసుకెళ్లే స్థితి నుంచి ఎదిగాం

మొదటి తరువాయి

వ్యవసాయం, వాతావరణ అంచనాల్లో మరింత విజ్ఞానం సాధించాలి. స్పేస్ సెక్టార్‌లో కో ఆపరేటివ్, ఎకో సిస్టమ్‌ను తీసుకువచ్చాం. జన్‌జీ అనుకున్నది సాధించేలా ప్రభుత్వం సహకరిస్తుంది. అంతరిక్ష రంగంలో కేంద్రం ఇస్తున్న మద్దతు వల్లే స్టార్టప్‌లు వస్తున్నాయి. ప్రయివేటు రంగంలోనూ అంతరిక్ష సంస్థలు పుట్టుకొస్తున్నాయి. జన్‌జీ ఇంజినీర్లు, డిజైనర్లు, కోడర్స్, సైంటిస్టులు అవకాశాలు అందిపుచ్చుకోవాలి" అని మోడీ తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ ఓఎస్‌డీ

మొదటి తరువాయి

ఇప్పటికే పలువిడతలుగా సిట్ విచారించింది. నలుగురు పోలీసు అధికారులను కూడా సస్పెండ్ చేసింది. ఈ కేసులో కీలక నిందితుడు రాధాకిషన్‌రావు రిమాండ్ రిపోర్టులో 'భారత రాష్ట్రసమితి సుప్రీం' అనే పదాన్ని వాడారు. అంటే, కేసీఆర్ ఆదేశాల మేరకే తాము ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్టు అప్పట్లో రాధాకిషన్‌రావు చెప్పా రనేవిధంగా రిమాండ్ రిపోర్టులో ఉంది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌కు ఓఎస్‌డీగా పనిచేసిన రాజశేఖర్‌రెడ్డిని విచారణకు పిలిచినట్టు తెలుస్తోంది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ ఓఎస్‌డీ

మొదటి తరువాయి

**ట్రంప్ ఆగ్రహం**

నేషనల్ గార్డ్ సభ్యులపై కాల్పులు జరిపిన ఘటనపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాల్పులు జరిపిన వ్యక్తిని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రం గా విమర్శించారు. గాయపడిన గార్డ్ సభ్యులు త్వరగా కోలుకోవాలని, కాల్పులు జరిపిన వ్యక్తికి కఠిన శిక్ష పడుతుందని హామీ ఇస్తూ, సైనిక దళాలకు, పోలీసులకు తన పూర్తి మద్దతు ఉంటుందని ఆయన ప్రకటించారు. "ఇద్దరు నేషనల్ గార్డ్స్‌పై కాల్పులు జరిపి, వారిద్దరినీ తీవ్రంగా గాయపరిచిన ఆ జంతువు కూడా తీవ్రంగా గాయపడింది. అయినప్పటికీ అతను భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. దేవుడు మన గొప్ప నేషనల్ గార్డ్‌ను, మన సైన్యాన్ని, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ మొత్తాన్ని ఆశీర్వదించుగాక. వీరు నిజంగా గొప్ప వ్యక్తులు. అమెరికా అధ్యక్షుడిగా నాతో పాటు, అధ్యక్ష కార్యాలయంతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరూ, మీతోనే ఉన్నాం" అని ట్రంప్ అన్నారు. దాడికి పాల్పడిన నిందితుడు ఆఫ్ఘన్ దేశానికి చెందిన వాడిగా గుర్తించగా, ఆ దేశ పౌరులకు వీసాలు నిలిపివేస్తున్నట్టు ట్రంప్ ప్రకటించారు.

**500 మంది గార్డ్స్ మోహరింపు**

గార్డ్స్‌పై కాల్పుల జరిగిన నేపథ్యంలో శ్వేత సౌధానికి భద్రత పెంచారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు వాషింగ్టన్ డీసీకి అదనంగా 500 మంది నేషనల్ గార్డ్ దళాలను మోహరించనున్నట్టు రక్షణ కార్యదర్శి పీట్ హెగ్‌సెత్ ప్రకటించారు. ప్రస్తుతం నగరంలో 2,200 మందికి పైగా సైనికులు విధులు నిర్వహిస్తున్నారని ఆయన చెప్పారు. గార్డ్స్‌పై జరిగిన దాడిపై హెగ్‌సెత్ తీవ్రంగా స్పందించారు. ఇదొక పిరికిపంద చర్యగా ఆయన అభివర్ణించారు. ఇది సైనికుల లక్ష్యంగా జరిగిన దాడిగా చెప్పారు. తమ రాజధానిని నగరాలను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. ఈ దాడి వైట్‌హౌస్‌కు కేవలం అడుగుల దూరంలో జరిగిందని, ఇది సహించరానిది అని ఆయన ఉద్ఘాటించారు.

## ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ కష్టమే..!

మొదటి తరువాయి

విలువ పడిపోతున్నందున బలహీనమైన వృద్ధికి దారితీస్తుంది.

**అమెరికా సుంకాలతో ఒత్తిడి..**

భారత్‌పై అమెరికా విధించిన అధిక టారిఫ్‌లు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయని ఐఎంఎఫ్ తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన 50 శాతం టారిఫ్‌లు దేశ ఎగుమతుల వృద్ధిని, పెట్టుబడుల విశ్వాసాన్ని, వాణిజ్యాన్ని ప్రభావితం చేస్తాయని హెచ్చరించింది. అధిక సుంకాలు, ప్రపంచ వాణిజ్య భారం, భౌగోళిక అంశాలు భారత ఆర్థిక వ్యవస్థకు నష్టాన్ని కలిగిస్తాయని ఐఎంఎఫ్ తెలిపింది. కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియకు (సిఐఆర్‌పి) తీసుకుంటున్న సమయం 700 రోజులకు పైగా పెరిగిందని, దీనివల్ల పెట్టుబడి సామర్థ్యం, విశ్వాసం పడిపోనుందని పేర్కొంది. దేశంలో ప్రయివేటు పెట్టుబడులు అస్థిరంగా ఉన్నాయని తెలిపింది. వాటి స్థానంలో ప్రభుత్వ పెట్టుబడులు అధికంగా నమోదవుతున్నాయని పేర్కొంది. ప్రభుత్వం చేస్తోన్న అధిక అప్పులు నామమాత్రపు జిడిపి పెంచడానికి సరైన మార్గం కాదని సూచించింది.

# మూడు రీజియన్లుగా రాష్ట్రాభివృద్ధి

మొదటి తరువాయి

డాక్యుమెంట్'ను రూపొందించాలని ఆదేశించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను పాలసీ డాక్యుమెంట్‌లో పొందుపరచాలని కోరారు. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025' పై గురువారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, అజహరుద్దీన్, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలే లక్ష్యంగా విజన్ డాక్యుమెంట్-2047కు ప్రభుత్వం సిద్ధమవుతోందని సీఎం ఈ సందర్భంగా చెప్పారు. అందరికీ సమాన అవకాశాలు, సమీకృత అభివృద్ధే లక్ష్యంగా రానున్న 22 ఏండ్లకు ఈ భవిష్యత్ కార్యాచరణ ఉండబోతోందని తెలిపారు. డిసెంబరు 8,9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహించబోయే గ్లోబల్ సమ్మిట్‌తో రాష్ట్ర భవిష్యత్‌ను కొత్త పుంతలు తొక్కించబోతున్నామని వివరించారు. ఆ సందర్భంగా తెలంగాణలో ఉన్న అపారమైన పెట్టుబడుల అవకాశాలను ప్రపంచ పెట్టుబడిదారుల ముందు ఉంచబోతున్నామని సీఎం తెలిపారు. తద్వారా ఇక్కడ పెట్టుబడులు పెట్టటం వల్ల కలిగే ప్రయోజనాలపై రెండు రోజులపాటు విస్తృతంగా ప్రచారం చేస్తామని చెప్పారు. అందుకే ఆ కార్యక్రమానికి భవిష్యత్ వేదికను కూడా ఫోర్త్ సిటీలోనే ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. విభిన్న రంగాల్లో పారిశ్రామిక అభివృద్ధికి గల అవకాశాలను వివరించి, వివిధ రూపాల్లో ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను ప్రకటిస్తామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన తెలంగాణ రైజింగ్ విజన్-2047 డాక్యుమెంట్ దార్శనిక భవిష్యత్ పత్రమని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్ర భవిష్యత్తుకు అది సమగ్ర రూపమని చెప్పారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంతో ఈ డాక్యుమెంట్‌ను తయారు చేయబోతున్నామని అన్నారు. సమాన వృద్ధి, మహిళా సాధికారత, యువశక్తి, స్థిరమైన అభివృద్ధి.. ఇలా ఈ మూడు ప్రధాన రంగాలపై వ్యూహాన్ని రూపొందించబోతున్నామని విశదీకరించారు. తెలంగాణను భారత దేశంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దడం తమ విజన్ డాక్యుమెంట్ లక్ష్యమని సీఎం తెలిపారు. చిన్న రాష్ట్రమైనా ఇక్కడ ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి తెలిపేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. అభివృద్ధిలో పక్క రాష్ట్రాలతో కాదు చైనా, జపాన్‌లతోనే పోటీ పడే లక్ష్యాలతో తెలంగాణ దూసుకుపోతోందని అన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, క్వాంటమ్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు, స్టార్టప్‌లు, టూరిజం, ఎగుమతుల్లాంటి రంగాలు రానున్న రెండు దశాబ్దాల్లో ఆర్థిక వృద్ధికి కీలకమని సీఎం తెలిపారు. తమ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, సులభ అనుమతులు, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు రాష్ట్రాన్ని పెట్టుబడిదారులకు మొదటి గమ్యస్థానంగా నిలబెట్టనున్నాయని వివరించారు. ఈ బలాలే పునాదిగా, మరిని పెట్టుబడులను ఆకర్షించే విధంగా విజన్ డాక్యుమెంట్ ఉండబోతోందని సీఎం తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ తెలంగాణ ఇలా మూడు జోన్లుగా మార్చి, సమతుల్యాభి వృద్ధిని సాధించేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీఎం చెప్పారు. అదే సమయంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామనీ, ఆ మేరకు వ్యవసాయ కార్యాచరణ కూడా విజన్ డాక్యుమెంట్‌లో భాగం కాబోతోందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధిలో మహిళా సాధికారత కూడా అత్యంత ప్రధానమైన అంశమని వివరించారు. అందుకే కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. డెవలప్‌మెంట్ ఎకానమీలో కాలుష్యం వల్ల కలిగే నష్టాలపై కూడా దృష్టి సారిస్తామని తెలిపారు. అందుకే 'నెట్-జీరో' తెలంగాణను ఆవిష్కరించబోతున్నామని చెప్పారు. బ్లూ అండ్ గ్రీన్ హైదరాబాద్ లక్ష్యంగా తెలంగాణ-2047 డాక్యుమెంట్‌లో మూసీ పునరుజ్జీవం, అందులో భాగంగా 2,959 చెరువులు, పార్కులు, అటవీ ప్రాంతాలను వాటి పూర్వ స్థితికి తీసుకురావటాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్రం ఆమోదించాలి

మొదటి తరువాయి

ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చకు తేవాలని సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఎంపీల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఎంపీల సమావేశం ఏర్పాటు చేశామన్నారు. బీసీల రిజర్వేషన్ అంశంపై పార్లమెంటు సమావేశాల్లో నిర్దేశిత ఫార్మాట్‌లో వాయిదా తీర్మానం లేదంటే ప్రశ్నోత్తరాల్లో చర్చకు తేవాలని కోరారు. ప్రధానమంత్రిని కలిసి అన్ని పార్టీల ఎంపీలూ వినతి పత్రాన్ని ఇవ్వాలని సూచించారు. బీసీల రిజర్వేషన్‌కు సంబంధించి రాష్ట్రంలో ఎపిక్ సర్వే జరిగిందనీ, ఎంపిరికల్ డాటా ఆధారంగా అసెంబ్లీలో బీసీల రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. పార్టీలకు అతీతంగా ఏకగ్రీవంగా ఆమోదించారని చెప్పారు. ఆ బిల్లు గవర్నర్ నుంచి కేంద్రానికి వెళ్లి అక్కడ పెండింగ్‌లో ఉందని వివరించారు. రాష్ట్ర ప్రయోజనాలకు అనుకూలంగా ఎంపీలందరూ పార్టీలకతీతంగా ఒక బృందంగా ఏర్పడి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారని




అన్నారు. ఎంపీలు అడిగిన సమాచారం నిమిషాల్లో లేదా గంటల్లో అందించేందుకు ఢిల్లీలో ప్రణాళిక ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామనీ, దీన్ని వినియోగించుకోవాలని సూచించారు. నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖ, జీఎస్టీ తదితర విషయాలకు సంబంధించి కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పథకాలకు గురించి గతంలో లేఖలు రాశామని గుర్తు చేశారు. అవి ఢిల్లీలోని ప్రత్యేక విభాగంలో ఎంపీలకు అందుబాటులో ఉంటాయనీ, వాటి ఆధారంగా ఎంపీలు కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

**రాష్ట్ర భవిష్యత్ నిర్మాణానికి విజన్ డాక్యుమెంట్**

వచ్చేనెల తొమ్మిదో తేదీ నాటికి ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తవుతున్న సందర్భంగా సాధించిన విజయాలు, రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణానికి సంబంధించి విజన్ డాక్యుమెంట్-2047 ఆవిష్కరించబోతున్నామని భట్టి విక్రమార్క చెప్పారు. దేశంలో, ప్రపంచంలో ప్రముఖులను దిగ్గజ కంపెనీలను ఆహ్వానిస్తున్నామని వివరించారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యసాధనకు అవసరమైన వనరులు, ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి కమిటీలు వేస్తున్నామనీ, కేంద్ర మంత్రులు, ఎంపీలందరినీ ఆహ్వానించాలని భావిస్తున్నామని చెప్పారు. ఆసక్తి ఉన్న ఎంపీలు పేర్లు ఇస్తే కమిటీల సభ్యులుగా నమోదు చేస్తామన్నారు. ప్రముఖ వ్యక్తులు, సంస్థలతో ఎంపీలు ఎవరికైనా పరిచయం ఉంటే వివరాలు ఇస్తే వారిని గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానిస్తామని చెప్పారు. కేంద్రానికి సంబంధించిన 12 శాఖల ద్వారా 47 అంశాలను గుర్తించామని అన్నారు. సెమీ కండక్టర్లకు సంబంధించిన అంశం కూడా చర్చించామన్నారు.

# నామినేషన్ల పర్వం షురూ

మొదటి తరువాయి




3,242, 37,440 వార్డులకు కేవలం 1,821 నామినేషన్లు దాఖలయ్యాయి. 318 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్న నల్లగొండలో అత్యధికంగా 421 నామినేషన్లు వచ్చాయి. 48 స్థానాలున్న ములుగు జిల్లాలో అత్యల్పంగా 22 నామినేషన్లు వచ్చాయి. 1,246 వార్డుమెంబర్లకు గాను సంగారెడ్డిలో అత్యధికంగా 149, మెదక్, కొమురం భీం ఆసీఫాబాద్ జిల్లాల్లో 4 చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్ర, శనివారాల్లో పెద్ద ఎత్తున ఆశావహులు క్యూ కడతారని భావిస్తున్నారు.

**బలవంతంగా ఏకగ్రీవం చేస్తే ఎన్నిక నిలిపివేత సర్క్యులర్ జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం**

సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికల్లో బలవంతపు ఏకగ్రీవాలు జరిగితే ఆ ఎన్నికను నిలిపి వేయాలని జిల్లా ఎన్నికల అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మకరంద సర్క్యులర్ జారీ చేశారు. వేలం ద్వారా, బలవంతంగా సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు జరిగే ఏకగ్రీవాలపై అధికారులకు ఎన్నికల కమిషన్ కీలక సూచనలు చేసింది. ఎన్నికల్లో వేలంపై ప్రత్యేక పర్యవేక్షణ విభాగం ఏర్పాటు చేస్తున్నట్టు మకరంద తెలిపారు. ఏదైనా గ్రామంలో బలవంతంగా నామినేషన్లను ఉపసంహరిస్తు న్నారని ఫిర్యాదులు అందినప్పుడు, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకోవాలని డీఈవోకు సూచించారు.

**రాష్ట్ర స్థాయి ఎంసీసీ కమిటీ ఏర్పాటు**

పంచాయతీల ఎన్నికల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. సీఎస్ చైర్మెన్‌గా జనరల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు సక్రమంగా జరిగేలా ఈ కమిటీ ప్రత్యేక దృష్టి పెట్టనుంది.

# అమరావతే గ్రోత్ ఇంజన్

మొదటి తరువాయి

భూములు తీసుకుని అభివృద్ధి చేద్దామని చూస్తున్నామని సిఎం తెలిపారు. తన హయాంలో ఎప్పుడూ భూసేకరణలో ఇబ్బందులు రాలేదన్నారు. భూముల ధరలు పెరగబోతున్నాయని, రిటర్నబుల్ ప్లాట్లను రైతులు అమ్ముకోవద్దని చెప్పారు. కొందరు రైతులు ఎఫ్ఎస్ఐ పెంచాలని కోరుతున్నారని, దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. రైతులు చెప్పే ఏ సమస్యనైనా వీలైనంతవరకు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. అందరూ కలిసి కట్టుగా ఉండాలని, ఐకమత్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. రెండో విడత భూ సమీకరణకు పూర్తిగా సహకరిస్తామని ముఖ్యమంత్రితో రైతులు చెప్పినట్లు సిఎం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సిఎం రూపొందించిన ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తే తమకు మేలు జరుగుతుందని రైతులు అన్నారు. రెండోదశ పూలింగ్‌కు అంగీకరించకపోతే అమరావతి మున్సిపాల్టీగానే మిగిలిపోతుందని ముఖ్యమంత్రి రైతులతో అన్నట్లు సమాచారం. ఈ సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ, ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబు, గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియ తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్ర సమస్యలు వినిపించండి.. ఎంపిలకు సిఎం దిశానిర్దేశం**

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రాష్ట్ర సమస్యలను స్పష్టంగా వినిపించాలని టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఎంపీలకు సూచించారు. పార్టీ ఎంపీలంతా సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన టిడిపి పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మొంథా తుపాను నష్టపరిహారం త్వరగా రాష్ట్రానికి అందేలా చూడాలని సూచించారు. కృష్ణా గోదావరి జలాల్లో, గోదావరి ట్రిబ్యునల్, సాగునీటి ప్రాజెక్టుల అనుమతులపై కేంద్రాన్ని ఒప్పించేలా పార్లమెంట్‌లో రాష్ట్ర గొంతుకను వినిపించాలన్నారు. వంశధార - గోదావరి నల్లమల సాగర్ అనుసంధానం, వెలిగొండ, ఉత్తరాంధ్ర జల ప్రాజెక్టులన్నీ రాష్ట్ర భవిష్యత్‌ని నిర్ణయిస్తాయని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును 2027లో జాతికి అంకితం చేసేందుకు కేంద్ర సహకారాన్ని కోరాలన్నారు. పత్తి, మొక్కజొన్న, అరటి ధరల పతనం, సిసిఐ నియమాల కారణంగా వచ్చిన సమస్యలను కేంద్రానికి వివరించి రైతులకు ఉపశమనం కల్పించేలా చూడాలని కోరారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్, డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్, వసతులపై కేంద్ర సహాయం సాధించాలని సూచించారు. ఎంఎస్ఎంఇ పార్కులు, క్వాంటం వ్యాలీ, ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్‌కు మద్దతు సాధించేలా ఎంపీలు కృషి చేయాలని ఆదేశించారు.

# బీసీల రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ ప్రభుత్వం



**కరీంనగర్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ విమర్శించారు. గురువారం రాంనగర్‌లో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాముల నిరసన కార్యక్రమం జరిగింది. ఎన్నం ప్రకాష్ మాట్లాడుతూ జిఓ 9ను రద్దు చేసి జిఓ 46తో ఎన్నికలు నిర్వహించడం బీసీలకు నమ్మకద్రోహమని అన్నారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని ఎన్నో పోరాటాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయని పక్షంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మంద వెంకన్న, కార్యదర్శి ఎన్నం వామన్, ప్రచార కార్యదర్శి పర్వతం మల్లేశం, యువజన సంఘం అధ్యక్షుడు మదాసు సంజీవ్, నాయకులు తిలన్ గౌడ్, వెంకటేష్, మారుతి, శ్రీనివాస్, మాధవ్, రాజారాం యాదవ్, పురుషోత్తం, ఆశిష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రిలో మంత్రి వివేక్ కీలక వ్యాఖ్యలు



**మందమర్రి, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మందమర్రి మండలం బి1 కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో కార్మిక, గనుల శాఖ మంత్రి డా. జీ. వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం అధికార అహంకారంతో అవినీతిలో మునిగిపోయిందని, ప్రజలు 2023లో కాంగ్రెస్ పార్టీని గెలిపించారని అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి 25 వేల మెజారిటీతో గెలవడం ఎవ్వరూ ఊహించలేదని పేర్కొన్నారు. బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, కేటీఆర్ సోషల్ మీడియా హైప్ కోసం వేల కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు. గ్రాడ్యుయేట్, కాంటోన్మెంట్ ఎన్నికల్లో కూడా బిఆర్ఎస్ పరిస్థితి దారుణమని, కేటీఆర్ నాయకత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులకు అందజేస్తోందని తెలిపారు. బిఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు, ఒక్క డబుల్ బెడ్రూం ఇవ్వలేకపోయారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పేదలకు న్యాయం చేస్తోందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని, మంచి అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి వేగంగా జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇటీవల డీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన రఘునాథరెడ్డిని ఘనంగా సన్మానించారు. నాయకత్వ మార్పు కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని కార్యకర్తలు అభిప్రాయపడ్డారు.

# దేహం, మనస్సు, ఆత్మల అనుసంధానమే యోగా






**కరీంనగర్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
భాగ్యనగర్ కాలనీలో జరిగిన యోగా శిక్షణ శిబిర వార్షికోత్సవంలో ప్రముఖ రచయిత, విశ్రాంత ప్రిన్సిపాల్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యోగా మానవ శరీరం, మనస్సు, ఆత్మలను కలుపుతూ సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుందని, ప్రతిరోజు కనీసం 45 నిమిషాలు యోగాసనాలు చేయాలని సూచించారు.యోగాచార్యులు లయన్ రాళ్లబండి శంకర ప్రసాద్ రెడ్డి గత 15 ఏళ్లుగా యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న శిబిరాల ద్వారా నగరవాసులు, ముఖ్యంగా మహిళలు లాభపడుతున్నారని క్లబ్ అధ్యక్షుడు లయన్ నరహరి లక్ష్మారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్ నారాయణ రెడ్డి, సదానందం, 50 మంది మహిళలు పాల్గొన్నారు. యోగా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళలు పలు యోగాసనాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

# అద్దెకో కూతురు కావాలి!

**బీజింగ్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆఖరి రోజుల్లో తన ఆలనా పాలనా చూసుకోవడానికి అద్దెకో కుమార్తె కావాలని ప్రకటించింది చైనాలోని ఒక వృద్ధురాలు. తనను బాగా చూసుకునే అమ్మాయికి నెలకు రూ.40 వేల జీతంలో పాటు తన వస్తువులు, తన ఫ్లాట్‌ను కూడా ఇస్తానని ఆఫర్ ఇచ్చింది.హెనన్ ప్రావిన్స్‌కు చెందిన మా అనే ఈ వృద్ధురాలు స్థానిక టీవీ కార్యక్రమంలో నవంబర్ 19న ఈ మేరకు ప్రకటన ఇచ్చిందని 'సౌత్ చైనా పోస్ట్' వెల్లడించింది. వాస్తవానికి తనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, అయితే వారిద్దరిపై ఆధారపడే పరిస్థితులు లేవని తెలిపింది. ప్రస్తుతం తాను ఆస్తమాతో బాధపడుతున్నానని,కూతురి పాత్ర పోషిస్తూ సమర్థంగా సేవలందిస్తూ చూసుకునే వారి కోసం తాను చూస్తున్నట్టు పేర్కొంది.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సర్వసన్నద్ధం కావాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాలు




**కరీంనగర్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీస్ కమిషనరేట్ యంత్రాంగం పూర్తి సిద్ధంగా ఉండాలని కమిషనర్ గౌష్ ఆలం వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. పాత నేరస్తులను బైండోవర్ చేయాలని, లైసెన్స్ తుపాకులను స్టేషన్లలో డిపాజిట్ చేయించాలని, గ్రామాల్లో బెల్టు షాపులను నిలిపివేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించాలని, గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పెంచాలని సూచించారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే స్పందించి ఎన్నికలు విజయవంతంగా జరగాలని ప్రతి అధికారి బాధ్యతగా పని చేయాలని కమిషనర్ గౌష్ ఆలం పేర్కొన్నారు.

# విద్యార్థులకు పండ్ల పంపిణీ



**పెద్దపల్లి, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జండా చౌరస్తాలో గురువారం గాయత్రీ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. స్వాతంత్ర ఉద్యమంలో జాతిని జాగృతం చేసిన జాతీయ గీతం వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు స్కూల్స్, కళాశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు గీతాన్ని ఆలపించారు. అనంతరం విద్యార్థులకు పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాసనగొట్టు వినయ్, రావికంటి రాజు, చిట్టిమల్ల రవి, కాసనగొట్టు శ్రీనివాస్, నగునూరి శ్రీనివాస్, యెల్లెంకి రాజేందర్, గౌరిశెట్టి దయాకర్, కముటాల గురుచరణం, బొల్లం ఆంజనేయులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష



**కరీంనగర్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకులు, హెచ్ఎసీఏ మేనేజింగ్ డైరెక్టర్ కె. చంద్రశేఖర్ రెడ్డి కరీంనగర్‌కు వచ్చారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో సమావేశమై ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య, ఏర్పాట్లపై చర్చించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే పాల్గొన్నారు.

# ఆరోగ్య మహిళా వైద్య శిబిరానికి కలెక్టర్ సహకారం



**కరీంనగర్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ టీఎన్జీవో సంఘ భవనంలో తెలంగాణ ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక ఆరోగ్య మహిళా కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించిన ఈ శిబిరంలో అపోలో రీచ్ ఆసుపత్రి, డీఎంహెచ్వో విభాగం, వాసన్ ఐ కేర్ సహకరించాయి. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, ఉద్యోగులు పాల్గొని రక్తపోటు, షుగర్, కంటి పరీక్షలు వంటి వైద్య సేవలు పొందారు. జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మహిళ ఆరోగ్యమే కుటుంబం, సమాజ అభివృద్ధికి పునాది అని, ఈ కార్యక్రమానికి సహకరించిన కలెక్టర్, వైద్య సంస్థలకు ఎన్జీవో సంఘం కృతజ్ఞతలు తెలిపారని అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, అధికారులు, మహిళా జేఏసీ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# అవినీతిపరుల ఆరోపణలు పట్టించుకోవద్దు




**కరీంనగర్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ బిఆర్ఎస్ నేతలు చల్లా హరిశంకర్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. మాజీ మేయర్, బిజెపి నేత సునీల్ రావు చేపడుతున్న సంతకాల సేకరణ ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. అంజన్ కుమార్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో మున్సిపల్ కార్పొరేషన్ అప్పుల్లో కూరుకుపోయిందని, అప్పులను తీర్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే విమర్శలు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. మంచినీటి సరఫరా, వీధి దీపాలు, రోడ్ల పనులపై బిఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, అవినీతి కుంభకోణాలతో మున్సిపల్ కార్పొరేషన్‌ను దెబ్బతీసింది బిఆర్ఎస్ పాలనేనని అన్నారు. సునీల్ రావు అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటూ ప్రజలను తప్పుదోవ పట్టించడం సిగ్గుచేటు అని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై చర్చించడానికి సిద్ధమని అంజన్ కుమార్ స్పష్టం చేశారు.

# డెంగ్యూకు సింగిల్ డోస్ టీకా

**బసిలియా నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా డెంగ్యూ కేసుల్లో పెరుగుదల నమోదవుతున్నది. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే తొలిసారిగా తాము ఆ వ్యాధి నియంత్రణకు సింగిల్ డోస్ టీకాకు ఆమోదం తెలిపామని బ్రెజిల్ అధికారులు బుధవారం తెలిపారు. బుటటన్-డివిగా పిలిచే ఈ వ్యాక్సిన్‌ను 12-59 ఏండ్ల వయసు గల వారి కోసం రూపొందించామని ఆ దేశ ఆరోగ్య నియంత్రణ సంస్థ అన్విసా తెలిపింది.డెంగ్యూ లక్షణాలకు వ్యతిరేకంగా ఈ టీకా 74.7 శాతం సామర్థ్యంతో పని చేసిందని సీఎన్ఎన్ బ్రెజిల్ నివేదించింది. అంటే ఈ వ్యాధి వచ్చిన ప్రతి నలుగురిలో ముగ్గురికి రక్షణ లభించింది. ఈ రక్షణ గతంలో ఈ వ్యాధి బారిన పడిన వారికి, పడని వారికి ఒకే విధంగా ఉంది.

## అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం, పెండింగ్ కేసుల పరిష్కారం పై దృష్టి



**కరీంనగర్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్**
: కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం రూరల్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గంజాయి రవాణా, అక్రమ ఇసుక, పీడీఎస్ బియ్యం తరలింపు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించి, వారెంట్లను వెంటనే అమలు చేయాలని సూచించారు. ప్రజలకు పోలీసుల రక్షణ ఉందనే భరోసా కల్పించేలా విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని, సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయ కుమార్, ఇన్‌స్పెక్టర్లు నిరంజన్ రెడ్డి, సదన్ కుమార్, బిల్లా కోటేశ్వర్, ప్రదీప్ కుమార్‌తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సిద్దిపేట కలెక్టర్



**సిద్దిపేట, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మెనులో ఉన్న బగారా అన్నం నాణ్యత సరిగా లేకపోవడంతో వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు పౌష్టికాహారం అందించకుండా నిర్లక్ష్యం వహించడం తగదని ప్రిన్సిపల్, ఫుడ్ చెకింగ్ టీచర్‌ను మందలించారు. కామన్ డైట్ మెనూ పాటించాలని, వంట ప్రక్రియను ప్రతిరోజూ పర్యవేక్షించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి ఆహారం రుచి, నాణ్యత గురించి తెలుసుకున్నారు. కడుపునిండా తినడం వల్లే శారీరకంగా బలంగా ఉంటారని పిల్లలకు సూచించారు. చదువు, ఆహారం విషయంలో ఎలాంటి లోటు లేకుండా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

## చామనపల్లి గ్రామ బిజెపి సర్పంచ్ అభ్యర్థిగా మునిగంటి కుమార్ నామినేషన్



**కరీంనగర్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామ బిజెపి సర్పంచ్ అభ్యర్థిగా యువ మోర్చా రాష్ట్ర నాయకుడు మునిగంటి కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. రూరల్ బిజెపి మండల, జిల్లా నాయకులతో కలిసి ఎన్నికల కార్యాలయంలో పత్రాలు సమర్పించారు. మునిగంటి కుమార్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తే చామనపల్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

# అసత్యపు ఆరోపణలకు పెట్టింది పేరు బిఆర్ఎస్




**మంథని, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మంథని పట్టణంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో టిపిసిసి ఎన్నికల కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడు, న్యాయవాది శశిభూషణ్ కాచే మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు అసత్యపు ఆరోపణలకు మారుపేరుగా మారారని మండిపడ్డారు. మానేరు నదిపై నిర్మించిన చెక్ డ్యాంలు నాణ్యత లోపంతో కూలిపోవడంపై మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్ రావు బాధ్యత వహించాలని ఆయన అన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం వాస్తవం కాదా అని ప్రశ్నిస్తూ, బాంబులతో పేల్చారని చెప్పడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో చెక్ డ్యాంలు, బ్రిడ్జిలు నాసిరకంగా నిర్మించి అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తూ, వాటిపై విజిలెన్స్ విచారణ జరిపి గత ప్రభుత్వ ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కొత్త శ్రీనివాస్, కుడుదల వెంకన్న, సురేష్, సాధుల శ్రీకాంత్, శంకర్, పర్షవన మోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో సిపిఐ పోటీ




**హుస్నాబాద్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
2025 డిసెంబర్‌లో జరగనున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గంలోని కొహెడ, చిగురుమామిడి, సైదాపూర్, ఎల్కతుర్తి, భీమదేవులపల్లి, హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లోని అన్ని స్థానాలకు సిపిఐ పోటీ చేయనున్నట్లు నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు నిర్విరామంగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కో కన్వీనర్ అందె స్వామి, ఆదరి శ్రీనివాస్, కోఆర్డినేటర్ కనుకుట్ల శంకర్, సిద్దిపేట జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ పాల్గొన్నారు.

## హుజురాబాద్ పట్టణ సుందరీకరణకు మరిన్ని నిధులు కేటాయిస్తామని వొడితల ప్రణవ్



**హుజురాబాద్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హుజురాబాద్ పట్టణానికి ఆనుకొని ఉన్న మోడల్ చెరువు సుందరీకరణ పనులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. చిల్డ్రన్ పార్క్, వాకింగ్ ట్రాక్ పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులను ఆయన సూచించారు. అనంతరం మాట్లాడుతూ చెరువు ఇన్ని రోజులు అభివృద్ధి చెందకపోవడం గత పాలకుల నిర్లక్ష్యమేనని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హుజురాబాద్ అభివృద్ధి కోసం 15 కోట్ల నిధులు మంజూరు చేసి, పిల్లల వినోదం కోసం ప్రత్యేకంగా కేటాయించామని తెలిపారు. చెరువులోని పిచ్చి మొక్కలు తొలగించకపోవడం గత పాలన వైఫల్యమని అన్నారు. మోడల్ చెరువుతో పాటు గంగోనికుంటను కూడా అభివృద్ధి చేస్తామని, హుజురాబాద్ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని వొడితల ప్రణవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ డిఈగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన దానయ్యకు సన్మానం

**వరంగల్, నవంబర్ 27(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: వరంగల్ రూరల్ విద్యుత్ డి ఈగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దానయ్యను వరంగల్ విద్యుత్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం దానయ్య కు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ అసోసియేషన్




వరంగల్ జిల్లా ప్రెసిడెంట్ రావీష్, సెక్రటరీ జెట్టి సురేందర్, డివిజన్ ప్రెసిడెంట్ బడితపురం వెంకన్న, సెక్రెటరీ దామోదర్, ట్రెజర్ ధూబాసి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ పంజా కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ శ్రీరాముల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ పరీక్ష ప్యాడ్లు పంపిణీ



**రామడుగు, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామడుగు మండలంలోని 7 జిల్లా పరిషత్ హై స్కూల్స్, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లలో పదవ తరగతి చదువుతున్న 225 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్, మండల విద్యాధికారి జి.పి.వి. రంగనాథ్ శర్మ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఏ. మనోజ్ కుమార్, ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ట్రస్ట్ ప్రతినిధులు ప్రతి సంవత్సరం పదవ తరగతి విద్యార్థులకు గణితం, సైన్స్ టాలెంట్ టెస్టులు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నామని, మెరిట్ అవార్డులు ఇస్తున్నామని, ఈ విద్యా సంవత్సరంలో 10,000 పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేయడం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ డి. సురేష్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాన్ని పరిశీలించిన కేడం లింగమూర్తి



**హుస్నాబాద్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కోహెడ మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయాన్ని సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంద ధర్మన్న, బందెల బాలకిషన్, గంపల శ్రీనివాస్, గ్రంథాలయ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి మరియు జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి చదువుకోవాలని సూచించారు.

## ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్ సందర్భంగా విద్యార్థినుల ర్యాలీ




**కరీంనగర్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: నిజామాబాద్‌లో నవంబర్ 26 నుంచి 28 వరకు జరుగుతున్న ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్ సందర్భంగా భారీ విద్యార్థినుల ప్రదర్శన ర్యాలీ నిర్వహించి బహిరంగ సభ జరిగింది. ఈ సభకు ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షురాలు శిల్ప సురేంద్రన్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పూజ, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్. రజినీకాంత్, టి. నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్, గర్ల్స్ కో కన్వీనర్లు మమత, రమ్య, కావ్య, సుమతో పాటు వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు



**వనపర్తి, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఘనపురం మండలం మానాజీపేట గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు జెట్టి యాదయ్య, బండారి శ్రీశైలం, సొంతం ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి గురువారం వనపర్తి పట్టణంలో మాజీ మంత్రి సింగిరేణి విజయం రెడ్డి నివాసంలో ఆయనను కలిసి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి విజయం రెడ్డి, నిరంజన్ రెడ్డి సమక్షంలో వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎం.పి.టి.సి నాగయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు కుమ్మరి శివకుమార్, నాయకులు చుక్కన్న, రాజ్‌కుమార్, బుచన్న తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ 24వ డివిజన్‌లో పర్యటించిన బిజెపి ఇంచార్జి ఊగిలే సుధాకర్ పటేల్



**కరీంనగర్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ 24వ డివిజన్‌లో బిజెపి ఇంచార్జి ఊగిలే సుధాకర్ పటేల్ పర్యటించి ప్రజలకు కాంగ్రెస్, టిఆర్ఎస్ మోసాలను వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండు పార్టీలూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, అవినీతి పాలనతో ప్రజలను నిరాశపరిచాయని ఆయన విమర్శించారు. టిఆర్ఎస్ పాలనలో అవినీతి పెరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలతో అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలైనా ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని ఆయన అన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు అమలు చేయకపోవడం ప్రజలను గోసపెడుతోందని పేర్కొన్నారు. ప్రజల ఆశలను ధ్వంసం చేసిన టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వైఫల్యాలను ఎండగడుతూ బిజెపి సంతకాల సేకరణ ఉద్యమం ప్రారంభించిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేష్, పెద్ది బాలరాజు, కంది రాజు, ఎనకందుల లక్ష్మీనారాయణ, నారాయణ, మెట్ట శ్రీను, పలువురు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశీయ ఉత్పత్తులను, మేకిన్ ఇండియాను ప్రోత్సహించండి



**జమ్మికుంట, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జమ్మికుంటలో జరిగిన ఇంటింటా స్వదేశీ ప్రతి ఇంటా స్వదేశీ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్ల రమేష్ మాట్లాడుతూ స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా మేకిన్ ఇండియా విజయవంతమవుతుందని, దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ స్వయం సమృద్ధి వైపు అడుగులు వేస్తోందని, స్వదేశీ ఉద్యమం డిసెంబర్ 25 వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాడ వెంకటరెడ్డి, గుజ్జ శ్రీనివాస్ రావు, సింగిరెడ్డి కృష్ణారెడ్డి, రంగు భాస్కరాచారి, నరసింహారాజు, పుప్పాల రఘు, ఆకుల రాజేందర్, కొలకాని రాజు, సంపెల్లి సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించండి



**హుస్నాబాద్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
డిసెంబర్‌లో జరగనున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని సిద్దిపేట జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ పిలుపునిచ్చారు. హుస్నాబాద్ మండలంలోని మహ్మదపూర్, నాగారం, పోతారం, మీర్జాపుర్, జిల్లేల్లగడ్డ, పందిల్ల, బంజెరుపల్లే గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ప్రజలు, రైతులు, కార్మికులు, యువత అందరూ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశాల్లో జనగాం రాజ్ కుమార్, గూడ పద్మ, పొదిల కుమారస్వామి, అయిలేని మల్లారెడ్డి, పిట్టల ప్రసాద్, ఇంద్రాల మల్లయ్య, పిట్టల సుధాకర్, పిట్టల మొగిలయ్య, ఇజ్జగిరి కిష్టయ్య, జంగ విజయ, గుడిపెల్లి రమేష్, కొలుగూరి కొమురయ్య, పుదరి రఘుపతి, బింగి సమ్మయ్యతో పాటు సిపిఐ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

## అవినీతి కేసుల్లో హసీనాకు 21 ఏండ్ల జైలు శిక్ష

**ఢాకా:నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బంగ్లాదేశ్ బహిష్కృత ప్రధాని షేక్ హసీనాకు ఢాకా ప్రత్యేక జడ్జి కోర్ట్-5 గురువారం మూడు అవినీతి కేసుల్లో మొత్తంగా 21 ఏండ్ల జైలు శిక్ష విధించింది. ఆమె కొడుకు, కూతురుకు కూడా ఈ శిక్ష అమలుకు ఆదేశించింది.ఢాకా పక్కన ఉండే పూర్బాంచల్‌లో ప్రభుత్వ గృహ నిర్మాణ ప్రాజెక్ట్‌లో హసీనా దరఖాస్తు చేయనప్పటికీ ఆమెకు చట్ట విరుద్ధంగా ప్లాట్లను కేటాయించారని జడ్జి మమున్ అన్నారు.

## కెనరా బ్యాంక్ ప్రారంభోత్సవం



**కొల్లాపూర్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కొల్లాపూర్ పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కెనరా బ్యాంక్ శాఖను గురువారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు జూపల్లి అరుణ్ ప్రారంభించారు. కెనరా బ్యాంక్ ఆహ్వానం మేరకు ఆయన చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగగా, ఈ సందర్భంగా జూపల్లి అరుణ్ మాట్లాడుతూ రైతులు, వ్యాపారులు, చిరు వ్యాపారులు, ప్రజలకు సులభంగా రుణాలు, సేవలు అందేలా బ్యాంకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలకు ఆర్థిక సహకారం అందించడంలో కెనరా బ్యాంక్ కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు.ప్రారంభోత్సవ వేడుకలో జూపల్లి అరుణ్‌కు కెనరా బ్యాంక్ సిబ్బంది శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో యన్మనుబెట్ల మాజీ సర్పంచ్ మేకల నాగరాజు, మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు షేక్ రహీం, పాష, మేకల శిరీష, కెనరా బ్యాంక్ ఏజీఎం వెంకటేశ్వర్ రెడ్డి, మేనేజర్ రవీందర్ రెడ్డి, అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు ఆర్టీసీ డిపో మేనేజర్ ఫోన్ ఇన్




**అమ్రాబాద్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అచ్చంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ నేడు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఫోన్ ఇన్ నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా అచ్చంపేట ఆర్టీసీ డిపో పరిధిలో నడుస్తున్న బస్సులతో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు, రాకపోకలకు ఆలస్యం, గ్రామీణ ప్రాంతాల్లో బస్సుల లభ్యత లోపం, డిపో పరిసరాల పరిశుభ్రత, నీటి సమస్యలు వంటి అంశాలపై ప్రజలు తమ సూచనలు, సలహాలు తెలియజేయవచ్చు.ప్రయాణికులు తమ సమస్యలను తెలియజేయడానికి ఈ ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు: 9154978024, 9490102876.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తపస్ కృషి



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన తపస్ మండల సమావేశంలో వడ్ల రాజేందర్‌ను మండల అధ్యక్షుడిగా, రాపోలు ప్రవీణ్ కుమార్‌ను ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల విద్యారంగ సమస్యల పరిష్కారానికి తపస్ కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా టెట్ సమస్యను ఎన్సిటీఈ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తెలంగాణ ఎంపీల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి చేరవేసి పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.కార్యక్రమంలో స్థానిక పాఠశాల కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి, తపస్ మండల గౌరవ అధ్యక్షులు కావలి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు ఉదారి నర్సింహా, మండల కోశాధికారి యం.రాము, వీడియో కన్వీనర్ పి.మహేష్, ఉపాధ్యక్షులు జీ.శైలజ, ఎం.శైలజ, మహిళా కన్వీనర్లు సంజీవ రాణి, పి.నందిత, జయ శ్రీ, స్వప్న రాం మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సైదాపూర్ మండలంలో జాగృతిలో మహిళల చేరికలు



**హుస్నాబాద్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఘనపూర్ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మహిళలు జాగృతిలో చేరారు. మండల మహిళా నాయకురాలు సుద్దాల రజిని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ కొత్తగా చేరిన మహిళలకు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారం, తెలంగాణ సంస్కృతి పరిరక్షణ కోసం జాగృతి కృషి చేస్తోందని, మహిళా రిజర్వేషన్ సాధనలో కవిత నాయకత్వం కీలకమైందని అన్నారు. నిరుద్యోగులు, విద్యార్థులు, సింగరేణి కార్మికుల సమస్యలపై కూడా జాగృతి పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో జాగృతి కార్యాలయాలు ప్రజలకు సమస్యల పరిష్కారం కోసం జనతా గ్యారేజ్‌లా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజ్ కుమార్, జంగా అపర్ణ, కుతాడి శ్రీనివాస్, రంగరవేణి లక్ష్మణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా దివ్యాంగుల ఆటల పోటీలు





**కరీంనగర్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీలు ఘనంగా జరిగాయి. కలెక్టర్ పమేలా సత్పతి పోటీలను ప్రారంభించి విజేతలకు మెడల్స్ అందజేశారు. చెస్, క్యారం, రన్నింగ్, షాట్‌పుట్, జావెలిన్ త్రో వంటి విభాగాల్లో అంధులు, బధిరులు, శారీరక, మానసిక దివ్యాంగులు తమ ప్రతిభను ప్రదర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి పోటీలు దివ్యాంగుల మానసిక వికాసానికి దోహదం చేస్తాయని అన్నారు. సంక్షేమ అధికారి ఎం. సరస్వతి అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహించామని, విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువజన, క్రీడ శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ రాంబాబు, లయన్స్ క్లబ్ ప్రతినిధి శివకాంత్, రెడ్ క్రాస్ అధ్యక్షుడు పెండ్యాల కేశవరెడ్డి, వివిధ సంఘాల ప్రతినిధులు, అంధుల, బధిరుల, మానసిక పాఠశాలల చిన్నారులు పాల్గొన్నారు.

## సైన్స్ అభిమానులు అందరూ ఆహ్వానితులే

**జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని**



**వనపర్తి, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి జిల్లాలో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నవంబర్ 28, 29, 30 తేదీల్లో చిట్యాల మహాత్మా జ్యోతిబా పూలే బీసీ పాఠశాల ( ఎం జె పి బి సి )లో నిర్వహించబడుతున్నట్టు జిల్లా విద్యాధికారి అబ్దుల్ఘని, తెలిపారు.జిల్లాలోని అన్ని రకాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యా అధికారులు, సైన్స్ అభిమానులు, విద్యార్థులు ఈ ఎగ్జిబిషన్‌కు హాజరై విద్యార్థుల శాస్త్రీయ ప్రతిభను అభినందించాలని వనపర్తి జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని ఆహ్వానించారు.

## బీసీ రిజర్వేషన్ల అన్యాయంపై అచ్చంపేట విద్యాసంస్థల బంద్ కు పిలుపు




**అచ్చంపేట, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో బీసీ రిజర్వేషన్లలో జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ రేపు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. బీసీఎఫ్ స్టేట్ సెక్రటరీ డాక్టర్ నారమోని నరేష్ యాదవ్ మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చినప్పటికీ, అమలులో మాత్రం కేవలం 17 శాతం మాత్రమే ఇచ్చి గత 2018 రిజర్వేషన్ల కంటే తక్కువగా కేటాయించడం ద్వారా ద్వంద్వ వైఖరిని ప్రదర్శించిందని అన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో మొత్తం 187 గ్రామపంచాయతీలలో ఎస్టీలకు 84, ఎస్సీలకు 27, బీసీలకు కేవలం 12 మాత్రమే కేటాయించగా, అండ్ రిజర్వ్ కింద మాధవరెడ్డి వారసులకు 64 కేటాయించడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. ఈ అన్యాయాన్ని ప్రజలకు, విద్యార్థులకు, మేధావులకు తెలియజేయడానికి రేపు పాఠశాలలు, కళాశాలల్లో బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ బంద్‌కు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, బీసీ సంఘాలు, కుల సంఘాలు, రాజకీయ పార్టీలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీసీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, రాష్ట్ర నాయకులు అజయ్ యాదవ్, మహేష్ యాదవ్, శ్రీనివాస్ చారి, శ్రీను, తులసి తదితరులు పాల్గొన్నారు.

## నేడు బీజేపీ స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరుకానున్న ఆచారి



**ఆమనగల్లు, నవంబర్ 27(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మండలం కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం ఈరోజు ఉదయం 10 గంటలకు జరుగనుంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తల్లోజు ఆచారి పాల్గొననున్నారు. మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమయానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కేకే శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

## కరీంనగర్‌లో సంకల్ప్ జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశం



**కరీంనగర్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అధ్యక్షతన ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో సంకల్ప్ జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నియోనేటల్ మోర్టాలిటీ రేటును తగ్గించడం ప్రధాన లక్ష్యంగా చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ సంచాలకుల ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించామని, నియోనేటల్ మోర్టాలిటీ రేటును సింగిల్ డిజిట్‌కు తగ్గించేందుకు అవసరమైన విధి విధానాలపై చర్చించామని తెలిపారు. కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్, హెచ్ఓడి పీడియాట్రిక్ విభాగం వైద్యులు, డిపిఓ ఎన్హెచ్ఎం స్వామి తదితరులు పాల్గొన్నారు.

# అతి త్వరలో ముఖ్యమంత్రి అధ్యక్షతన హై పవర్ కమిటీ సమావేశం ...





-ఎస్.సి.డి.డిపార్ట్మెంట్ సమీక్ష సమావేశంలో ఎస్సీ ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్య...
-ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీసి నిధులు 7 కోట్లు మంజూరు...
-ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు కూడా ప్రీ మేట్రిక్ స్కాలర్షిప్‌లు..
-ఎస్.సి.డి.డి కమిషనర్ క్షితిజ ....

**హైదరాబాద్, నవంబర్ 27(నీలగిరి ఎక్స్ ప్రెస్):** అతి త్వరలో ముఖ్యమంత్రి అధ్యక్షతన సంక్షేమ శాఖల హై పవర్ కమిటీ సమావేశం జరగనున్నట్లు ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి తాము చేసిన విజ్ఞప్తి మేరకు హాయ్ పవర్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు అంగీకరించినట్లు చైర్మన్ తెలిపారు.

షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ సమీక్ష సమావేశం ఎస్ సి డి డి కమిషనర్ ఎన్.క్షితిజ అధ్యక్షతన మాసబ్ ట్యాంక్ లోని డి ఎస్ ఎస్ భవన్ లో ఎస్సీ కార్పొరేషన్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జరిగింది. ఈ సమావేశానికి షెడ్యూల్డ్ కులాల మరియు షెడ్యూల్డ్ తెగల శాఖ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ముఖ్యఅతిథిగా, కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్ లు అతిథులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ హై పవర్ కమిటీ సమీక్ష సమావేశం ముఖ్యమంత్రి సమక్షంలో జరగనున్నదని, తద్వారా పెండింగ్ లో ఉన్న సమస్యలన్నిటికీ తక్షణ మోక్షం లభిస్తుందని, ప్రయత్న లోపం ఉండొద్దని ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య అన్నారు. షెడ్యూల్డ్ కులాలు, బడుగు బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్న వసతి గృహ సంక్షేమ గృహాలలో సమతౌల్యం అవసరమని, లేనట్లయితే ఆ ప్రభావం విద్యార్థుల పై పడి భవిష్యత్తు దెబ్బతిని అవకాశం ఉందని, మౌలిక వసతులు కల్పించేలా అదేవిధంగా నిధుల కొరత లేకుండా చొరవ తెలుసుకోవాలని చైర్మన్ అన్నారు. అదేవిధంగా సంక్షేమ హాస్టల్లో డైట్ చార్జీలు గాని వసతి గృహ భవనాలకు కిరాయిలను గాని ఆటంకాలు ఉండకూడదని, లేనట్లయితే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురై, వారి భవిష్యత్తు కు ఆటంకం ఎదురవుతుందని చైర్మన్ అన్నారు. తాను క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న విశేషాలను, హాస్టల్ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి వివరించామని, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి హై పవర్ కమిటీ సమావేశానికి నిర్ణయం తీసుకున్నారని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య వెల్లడించారు. ఎస్సీ కార్పొరేషన్ లో గత సంవత్సరం నుంచి నిరుపయోగంగా వివిధ జిల్లాలలో ఉన్న రూ. ఏడు వందల కోట్లను షెడ్యూల్డ్ కులాల అవసరార్థులకు చెందిన వివిధ సంక్షేమ పథకాలకు వినియోగించాలని చైర్మన్ సూచించారు. సమీక్ష సమావేశంలో కమిషనర్ క్షితిజ మాట్లాడుతూ 9, 10వ తరగతు లలో ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్‌ని ఈ సంవత్సరం నుంచి ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు కూడా అందించబోతున్నామని, అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా డీఈవోలు, ఆర్ జేడీలు, విద్యాశాఖలోని వివిధ స్థాయిల్లోని అధికారులతో సమన్వయం చేసుకొని చైతన్య సమావేశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి మండలాన్ని ఒక యూనిట్ గా చేసుకొని, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మ్యాపింగ్ చేస్తూ పాఠశాలలకే వెళ్లి రిజిస్ట్రేషన్ చేస్తున్నారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర సమాన భాగస్వామ్యంతో చెల్లింపులు జరిపేందుకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల బాధితుల నష్టపరిహారం నిమిత్తం ఏడు కోట్ల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. జిల్లా విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ (డివిఎంసి) సమావేశాల నిర్వహణ గురించి పి.శంకర్ అడిగిన ప్రశ్నకు కమిషనర్ సమాధానం ఇస్తూ రాష్ట్రంలోని ఒకట్రెండు మినహా అన్ని జిల్లాలలో డీవీఎంసీ సమావేశాలు జరిగాయని, జరగని జిల్లాలలో ఇకనుంచి రెగ్యులర్ గా నిర్వహిస్తామని తెలిపారు. ఎస్సీ ఎస్టీ అత్యాచారాల తదితర అంశాలపై రాష్ట్ర స్థాయిలో యాక్షన్ ప్లాన్ ను అతి త్వరలో రూపొందిస్తున్నామని, అదే మాదిరిగా జిల్లాలలో కూడా సమావేశాలు నిర్వహిస్తామని, తెలంగాణ వికాస్ మంచు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ల వెంకటేశ్వర్లు అడిగిన విషయాన్ని ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 12 జిల్లాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి ఒకఅధికారులు లేరని, తద్వారా పాలనలోనూ, అభివృద్ధి కార్యక్రమాల్లోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని 12 డీఎస్సీడీవోల కేడర్ స్ట్రెంత్ మంజూరు చేయించాలని, తద్వారా ఎస్ సి డి డి కార్యక్రమాలు అన్ని జిల్లాలలో సకాలంలో సజావుగా జరిగే అవకాశం ఉందని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య దృష్టికి తెచ్చారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ బాధితులకు పెన్షన్ సౌకర్యాన్ని కూడా అందజేస్తున్నట్లు ఈ సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ వివరించారు. ఇదిలా ఉండగా హాస్టల్ల నిర్వహణ, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల మంజూరు తదితర అంశాలపై అసిస్టెంట్ డైరెక్టర్ పి.శ్రీనివాస్ , ప్రిమెట్రిక్ మరియు పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్‌లపై జాయింట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి పిపిటి ద్వారా వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో షె.కు గురుకులాల జాయింట్ సెక్రటరీ గీత, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ నర్సింహారెడ్డి, సిఐడి పిసిఆర్ సెల్ అడిషనల్ ఎస్పీ ఎం.శ్రీనివాస్, ఎస్.సి.డి.డి కమీషనరేట్ డీడీలు సల్మాబాను, రమాదేవి, శ్రావణ్ కుమార్, ఏడి సుబ్బలక్ష్మి, ఎస్.సి.కార్పొరేషన్ ఈడీలు శ్యాంసుందరి, కెబీ చారి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ నుండి ఐఎన్ టియుసి 327 నుండి జిల్లా సెక్రటరీగా నిరంజన్ ఎన్నిక

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం.




**దేవరకొండ నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ నుండి ఎన్నిక కాబడిన ఎండి నిరంజన్ ఐ ఎన్ టి యు సి327 జిల్లా సెక్రెటరీగా ఎన్నిక కాబడిన నిరంజన్ ను అధ్యక్షుడు ఎన్విటి. ఎం.సురేష్ కంపెనీ ప్రెసిడెంట్ హైదరాబాద్ సభ్యులతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ కార్మికుల కోసం నిరంతరం కష్టపడతానని వారి కష్టసుఖాలను చూసుకుంటానని వారికి కావలసిన సదుపాయాలన్నీ ఏర్పాటు చేస్తానని ఆయన తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్తయ్య, రాజేశ్వరరావు, రమణారెడ్డి, ముత్యాలు, ఎల్లయ్య చారి, వెంకటేశు ఈ కార్యక్రమంలో 327 కి సంబంధించిన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వెల్దండ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా మట్ట యాదమ్మ నామినేషన్





**వెల్దండ, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** వెల్దండ మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థిగా మట్ట యాదమ్మ నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం ఆంజనేయస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ కుమార్ యాదవ్, మండల యూత్ అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్, సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముదిగొండ రమేష్, ఎండి రషీద్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూరాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తి చెందారని, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పటం కట్టాలని కోరారు. వెల్దండ మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామని, మట్ట యాదమ్మను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. నామినేషన్ ప్రక్రియలో మట్ట వెంకటయ్య గౌడ్ పాటు గ్రామ ప్రజలు తండోపతండాలుగా, వందలాది మంది గ్రామపంచాయతీ వద్దకు చేరి పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.


# రాష్ట్రస్థాయిలో బంగారు పథకాలు సాధించాలి

**జిల్లా అదనపు ఎస్పీ వేముల వెంకటేశ్వర్లు**




**నాగర్‌కర్నూల్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో నిర్వహించిన 44వ జూనియర్స్ ఖో ఖో కోచింగ్ క్యాంపు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు ఎస్పీ వేముల వెంకటేశ్వర్లు, ఆత్మీయ అతిథిగా డాక్టర్ చెన్నయ్య హాజరయ్యారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూచదువులో రాణించాలంటే క్రీడలు కీలకమని, ఆటల ద్వారా ఒత్తిడిని తగ్గించుకొని మానసిక ధైర్యం, సాహసాలు అలవర్చుకోవచ్చని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో నిమగ్నమై తమ లక్ష్యాలను సాధించాలని, ముందున్న క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రస్థాయిలో రాణించి బంగారు పథకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు.డాక్టర్ చెన్నయ్య మాట్లాడుతూపది రోజులపాటు నిర్వహించిన కోచింగ్ క్యాంపులో నేర్చుకున్న నైపుణ్యాలను రాష్ట్రస్థాయిలో ప్రదర్శించి ఉత్తమ క్రీడాకారులుగా అవార్డులు, బంగారు పథకాలు సాధించాలని సూచించారు. అనంతరం అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు బాలికలు, బాలురకు క్రీడా కిట్లను అందజేశారు. ఈ కిట్లను ఎత్తవు భాస్కర్, ఆలెటి శ్రీనివాసులు స్పాన్సర్ చేశారు.క్యాంపు నిర్వహణకు సహకరించిన వంకేశ్వరం నిరంజన్ మాజీ హెడ్‌మాస్టర్, హకీమ్ రాజేష్, క్లాస్ మెంట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు వాసా రాఘవేందర్, ఎం.ఈ.ఎఫ్ జిల్లా అధ్యక్షులు దేవరపాగా ప్రభాకర్, గుడిపల్లి నిరంజన్, సుబ్బయ్య, ఆంజనేయులు, హనుమంతరావు తదితరులు ఆర్థిక సహకారం అందించారు.కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు చింత తిరుపతయ్య, డి.టి.ఎఫ్ జిల్లా బాధ్యులు శ్రీనివాసులు, జిల్లా ఖో ఖో అసోసియేషన్ ఇన్‌చార్జి నిరంజన్ యాదవ్, కృష్ణ, యాదయ్య, రవికుమార్, మన్యం యాదవ్, జెట్టి లక్ష్మి, ఎస్.జి.ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. నాగేశ్వరరావు, మాజీ ఎస్.జి.ఎఫ్ సెక్రటరీ పాండు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఖాతాలలో వరి ధాన్యం నగదు జమ



**మంచిర్యాల, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** జిల్లాలో 2025 -26 సీజన్‌కు సంబంధించి కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతోందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య తెలిపారు.రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి వరి ధాన్యం కొనుగోలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం విక్రయించిన రైతుల వివరాలు ఆన్‌లైన్ చేసిన వెంటనే వారి ఖాతాలలో నగదు జమ అవుతోందని వివరించారు.గురువారం ఇటిక్యాలలో మెప్మా ఆధ్వర్యంలో, గుల్లకోటలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ తెలిపారు.

# తెలంగాణ లొ 2028 ఎన్నికల్లో రాబోయేది బీసీ ప్రభుత్వమే టీఆర్పీ పార్టీ రాష్ట ప్రధాన కార్యదర్శి :వట్టే జానయ్య యాదవ్

**-దగాపడ్డ బీసీలకు న్యాయం జరగాలంటే అది కేవలం తెలంగాణ రాజ్యాధికార పార్టీ తోనే సాధ్యం**

**-రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో యువత ముందుండాలి.**



**నల్లగొండ ,నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** తెలంగాణ రాజ్యాధికారి పార్టీ టిఆర్పి వ్యవస్థాపక అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదేశాలతో నలగొండ జిల్లా కేంద్రంలోని రామగిరి నల్లగొండ ప్రెస్ క్లబ్ లో TRP పార్టీ రాష్ట ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ పాల్గొని మాట్లాడుతూ బీసీ సమాజం కోసం పోరాడే నాయకుడు తెలంగాణ రాజ్యధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్ననే అని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అన్నారు. భారత రాజ్యాంగంలో రిజర్వేషన్ కి సంబంధించి 50 శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్ ఉండకూడదని ఎక్కడ కూడా రాయబడలేదుని గుర్తు చేశారు. 50 శాతం సీలింగ్ అనేది కేవలం సుప్రీంకోర్టు నిర్ణయించి అమల్లోకి తీసుకువచ్చిన రూలు మాత్రమే అన్నారు. అలాగే కాన్స్టిట్యూషనల్ ప్రొవిజన్స్ అయినా ఆర్టికల్ 15(4), 16(4), 16 (4fl ), 16(4B ) కూడ 50 శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్ ఉండకూడదని ఎక్కడ కూడ రాయబడలేదు. చెప్పబడలేదని అన్నారు. కానీ మనకు స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఈ అగ్రవర్ణాల పార్టీలు, అగ్రవర్ణాల నాయకులు బీసీలను ఎలా అనగదొక్కాలని తీసుకొచ్చిన సీలింగ్ మాత్రమే ఇది అని అన్నారు. మండల కమిషన్ తీసుకొచ్చినప్పుడు దేశాన్ని పరిపాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుడు న్యాయం చేయలేదని విమర్శించారు. ఇప్పుడు తెలంగాణలో అధికారంలో ఉన్నా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని బీసీలను మభ్యపెడుతూ.. మోసం చేస్తూ, లోకల్ బాడీ ఎలక్షన్స్ లో కేవలం 17 శాతం రిజర్వేషన్ పరిమితం చేసి బీసీలను ఎలా అనుగదొక్కాలని చూస్తున్నారన్న అంశం చాలా స్పష్టంగా అర్థం అవుతుందని అగ్రహం వ్యక్తం చేశారు. బీసీల కోసం ప్రశ్నించే, పోరాడే నాయకుడు కేవలం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఒకే ఒక్కడు అని ఈ సందర్భంగా తెలియజేసుకుంటున్నాను అని అన్నారు. అలాగే బీసీలకు న్యాయం జరగాలన్న కేవలం టిఆర్పి పార్టీతో మాత్రమే న్యాయం జరుగుతుందని బిసి సామాజిక వర్గానికి తెలియజేసుకుంటున్నాను అని అన్నారు. పార్టీలో ఉన్న బీసీలకు కూడ ఎందుకంటే ఇతర న్యాయం జరగాలంటే తీన్మార్ మల్లన్న తోనే సాధ్యమవుతుందని వట్టే జానయ్య స్పష్టం చేశారు. బీసీల కు న్యాయం జరగాలన్న రాజ్యాధికారం రావాలన్న, యువత, బిసి ప్రజలు ఈ లోకల్ బాడీ ఎలక్షన్స్ లో సర్పంచ్ గా వార్డ్ మెంబర్స్ గా పోటీ చేయాలని అన్నారు. బీసీలు ఎవరైతే ఈ సర్పంచ్ ఎలక్షన్స్ లో పోటీ చేస్తారో వారికి టీఆర్పి పార్టీ నుండి సంపూర్ణ మద్దతు లభిస్తుందని, మీ గెలుపు దిశగా టిఆర్పి పార్టీ పనిచేసి మిమ్మల్ని విజేతలుగా నిలబెడుతుందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కడైనా ఎవరైనా సర్పంచ్ గాని, వార్డ్ మెంబర్స్ కి పోటీ చేయాలనుకుంటే ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులను సంప్రదించవచ్చు అని అన్నారు. ఫోన్ లో గాని నేరుగా గాని కలిసి మద్దతు పొందవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమం లో సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, మేడబోయిన సాయి(ఉమ్మడి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్), ఏ వరుణ్ కుమార్(జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్), సోషియల్ మీడియా కె. వినోద్ చారి, పి. నాగార్జున. టీఆర్పీ కార్యకర్తలు
వట్టే లింగరాజు, బూర కిరణ్, మామిడి ఉదయ్, ఏర్పుల రాజు, గుగులోతు సుమన్ తదితరులు పాల్గొన్నారు

# నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి



**మంచిర్యాల, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. గురువారం లక్షెట్టిపేట మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించి రిటర్నింగ్ అధికారులకు సూచనలు చేశారు.జిల్లాలో మూడు విడతలలో ఎన్నికలు జరగనున్నాయని, మొదటి విడతలో 90 సర్పంచ్, 816 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. నామినేషన్ కేంద్రం వద్ద ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల వివరాలు ప్రదర్శించాలని, 100 మీటర్ల పరిధిలో గుంపులను అనుమతించరాదని, అభ్యర్థులు, ప్రతిపాదకులను మాత్రమే అనుమతించాలని ఆయన ఆదేశించారు.అనంతరం ఇటిక్యాల వరి కొనుగోలు కేంద్రం, మండల ఆరోగ్య కేంద్రంలో నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

# జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన రవళిని అభినందించిన బీజేపీ నాయకులు



**హుస్నాబాద్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** హుస్నాబాద్ పట్టణానికి చెందిన పచ్చిమట్ల శ్రీనివాస్ కుమార్తె పచ్చిమట్ల రవళి రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలో మూడవ స్థానంలో నిలిచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు రవళిని అభినందించి, శాలువాతో సత్కరించారు.వచ్చే నెలలో ఒడిశాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు వెళ్లడానికి రవాణా ఖర్చులు అవసరమని తెలియజేయగా, బీజేపీ నాయకులు ఆర్థిక సహాయం అందించారు. రవళి జాతీయ స్థాయిలో విజయం సాధించి హుస్నాబాద్ ప్రాంతానికి గౌరవం, కీర్తి తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.కార్యక్రమంలో బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు బోడిగే వెంకటేష్, ప్రధాన కార్యదర్శి పోలోజు రాజేందర్ చారి, సీనియర్ నాయకులు వేముల దేవేందర్ రెడ్డి, వరియోగుల అనంతస్వామి, వెల్దండి సంతోష్, ఆశాడపు శ్రీనివాస్, వార్డు ప్రజలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**ఎన్నికల పరిశీలకురాలు ఐఏఎస్ అధికారి కొర్రా లక్ష్మి**





**నల్లగొండ, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నల్గొండ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి నల్గొండ జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు గా నియమితులైన ఐఏఎస్ అధికారి, రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కొర్రా లక్ష్మికి వివరించారు. గురువారం గ్రామపంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కొర్ర లక్ష్మి నల్గొండ కలెక్టరేట్ కు రాగా జిల్లా కలెక్టర్ పూల మొక్కతో స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలకు చేసిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలకురాలుకు వివరిస్తూ మొదటి విడత నామినేషన్ల స్వీకరణ మండలాలు,నామినేషన్ల ఏర్పాట్లు, ఆర్వో,ఏ ఆర్వోల నియామకం, సిబ్బంది, ర్యాండమైజేషన్, శిక్షణ, సూక్ష్మ పరిశీలకుల నియామకం, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలు, జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు తదితర అన్ని వివరాలను తెలియజేశారు. అంతేకాక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఎన్నికల కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు,ఇతర నివేదికలను ఎప్పటికప్పుడు టి పోల్ ద్వారా పంపిస్తున్నామని తెలిపారు. అదే విధంగా సూక్ష్మ పరిశీలకుల నియామకానికి సంబంధించిన వివరాలను, పోలింగ్ కేంద్రాలు, సౌకర్యాలు తదితర వివరాలను అనంతరం ఎన్నికల పరిశీలకురాలు కొర్ర లక్ష్మి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ లతోకలిసి నార్కెట్ పల్లి గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన క్లస్టర్ నామినేషన్ కేంద్రాన్ని, అనంతరం చిట్యాల మండలం, వెలిమినేడు లో గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన క్లస్టర్ నామినేషన్ కేంద్రాలను పరిశీలించి అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ కేంద్రంలో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్ వద్దకు వెళ్లి అక్కడ నామినేషన్ పత్రాలు, నామిషన్లు వేసే సందర్భముగా అభ్యర్థులు పాటించవలసిన సూచనలు, ఇతర నియమ నిబంధనల కాపీలు, నామినేషన్ పత్రం తోపాటు సమర్పించాల్సిన ధ్రువపత్రాల వివరాలు పరిశీలించడమే కాకుండా హెల్ప్ డెస్క్ లోని సిబ్బందితో మాట్లాడారు. అనంతరం నామినేషన్ల స్వీకరించే ఆర్ ఓ గదులను, మెటీరియల్ ను, ఇతర ఏర్పాట్లను పరిశీలించి నామినేషన్ల స్వీకరణ సందర్భంగా అనుసరిస్తున్న ప్రక్రియను అడిగి తెలుసుకుని ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

### ఒలింపియాడ్ ఎడ్యుక్వెస్ట్

# మండల స్థాయి పోటీలు

-తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల మరియు కళాశాల విద్యార్థులకు మొదటి బహుమతి.
జిల్లా స్థాయి కి ఎంపిక.



**దేవరకొండ నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా డిండి మండలంలో గురువారం నాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒలంపియాడ్ ఎడ్యుక్వెస్ట్ పోటిలో నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల మరియు కళాశాల విద్యార్థులు నూతన,భగవంత్,సిరి,వర్షిత, మొదటి బహుమతి ని గెలుచుకొని, జిల్లా స్థాయి కి ఎంపికైనారు.ఈ విద్యార్థులు ఇంగ్లీష్ ఫ్యాకల్టీ సభ్యులు పి.జగన్నాథ్ ,అంకం జ్యోతి, మార్గదర్శకత్వంలో జిల్లా స్థాయికి ఎంపికైనారు.ఈ కార్యక్రమం లో ఏంఈఓ గోప్య నాయక్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెడ్ మాస్టర్ గీతాంజలి,యాదయ్య,పల్లా వెంకటయ్య, అనిత, సుజాత,బి.సందీప్, థెరిస్సా లెవీనా, వి.ఆంజనేయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేవరకొండ నియోజకవర్గ ముఖచిత్రం మార్చుతా

ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.



**దేవరకొండ నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నేరేడుగొమ్ము మండలంలోని ధర్మారేఖ్య తండాలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో పాల్గొని, శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయానికి సందర్శించి, దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్.ధర్మారేఖ్య తండా , పేర్వాల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీ లో చేరుతున్న సందర్భంగా వారిని కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం విద్య, వైద్యం, రైతాంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, నా ఐదు సంవత్సరాల పదవీకాలంలో ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలో వాస్తవమైన,స్పష్టమైన మార్పు తీసుకురావడమే నా ప్రధాన లక్ష్యం.ప్రజల నమ్మకానికి న్యాయం చేస్తూ,ప్రతి గ్రామం అభివృద్ధి చెందే వరకు నా సేవ నిరంతరం కొనసాగుతుంది అని అన్నారు.ఈ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కడ్తాల్‌లో ప్రత్యేక పోలీస్ చెక్‌పోస్ట్



**కడ్తాల్, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముచ్చర్ల గేట్ ప్రధాన రహదారి పై రోడ్డుపై ప్రత్యేక పోలీస్ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం ఇన్‌స్పెక్టర్ గంగాధర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలు శాంతి, క్రమశిక్షణ పాటించాలని విజ్ఞప్తి చేశారు. గందరగోళ పరిస్థితులు సృష్టించే ప్రయత్నం చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో మద్యం అనధికారిక విక్రయం, అధిక ధరలకు అమ్మకం, వినియోగం, అలాగే గాంజా మరియు ఇతర మత్తు పదార్థాల విక్రయం, వినియోగం పైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు.ఎన్నికల సమయంలో ?50,000 కంటే ఎక్కువ నగదు తీసుకువెళుతున్న వారు సరైన ఆధారాలు చూపించాల్సి ఉంటుందని, లేకపోతే నగదు స్వాధీనం చేసి కేసులు నమోదు చేస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సై వరప్రసాద్తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో

# యువత సత్తా చాటాలి

నేటి సమాజ నిర్మాణంలో యువతకు ఉన్న స్థానం అత్యంత కీలకం. దేశభవిష్యత్తుకు అవేనని అందరూ చెప్పినా, ఆ స్థానాన్ని నిజమైన అర్థంలో నిలబెట్టేది వారి సక్రమమైన పాల్గొనికే. ప్రత్యేకంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత పాల్గొనడం ఎంతో అవసరం. గ్రామాలు, పట్టణాలు, వార్డులుఇవి ప్రజాస్వామ్యానికి అతి సమీపమైన వేదికలు. ప్రజల రోజు వారీ జీవితాన్ని నేరుగా ప్రభావితం చేసే నిర్ణయాలు ఇక్కడే తీసుకోబడతాయి. అందువల్ల యువత ఈ ఎన్నికల్లో సత్తా చాటడం వల్ల సమాజంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకోగలవు.మొదటగా, యువతలో ఉన్న శక్తి, సృజనాత్మకత సమాజ అభివృద్ధికి పెద్ద ఆయుధం. వేగంగా మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందాలంటే కొత్త ఆలోచనలు, నూతన విధానాలు అవసరం. ఇవి ప్రధానంగా యువతలోనే ఎక్కువగా కనిపిస్తాయి. స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, సమాచార సాంకేతికత వినియోగయి ఇవన్నీ యువత ప్రత్యేకతలు. ఈ విశేషాలు స్థానిక సంస్థల్లో ప్రతిబింబిస్తే ప్రజా సేవ మరింత సమర్థవంతంగా మారుతుంది.ద్వితీయంగా, రాజకీయ అవగాహన పెరిగిన యువత అవినీతి



రహిత పరిపాలనకు దారితీయగలదు. నేటి యువతలో ఉన్న నిష్పాక్షిక దృక్పథం, పారదర్శకతపై విశ్వాసం ప్రజాప్రతినిధుల పనితీరును మెరుగుపరుస్తాయి. ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తూ, తగిన ప్రశ్నలు అడుగుతూ, సరికొత్త నాయకులను ఆవిష్కరించే శక్తి కూడా యువతలోనే ఉంటుంది. ఇందువల్ల స్థానిక సంస్థల్లో బాధ్యతాయుత నాయకత్వం ఏర్పడుతుంది. మూడవది, యువత పాల్గొనే ఎన్నికలు సమాజంలో రాజకీయ చైతన్యాన్ని పెంచుతాయి. ఓటు విలువను అర్థం చేసుకునే యువత, ఇతరులను కూడా చైతన్యవంతులను చేస్తుంది. "నా ఓటు – నా హక్కు" అనే అవగాహన సమాజంలో విస్తరించాలంటే యువత చురుకైన పాత్ర పోషించాలి. ఇది ప్రజాస్వామ్యాన్ని బలపరచడమే కాకుండా, సమాన అభివృద్ధికి దారితీయగలదు. చివరగా, యువత స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడం కూడా అత్యంత ముఖ్యమైంది. నాయకత్వం వహించాలని, ప్రజలకు సేవ చేయాలనే తపన కలిగిన యువత ముందుకు రావాలి. స్థానిక స్థాయిలో పని చేస్తూ వారు అనుభవాన్ని సంపాదిస్తారు, అదే భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిల నాయకత్వానికి మార్గసూచికగా మారుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత ప్రవేశం అనేది కేవలం ఓ బాధ్యత మాత్రమే కాదు, ఒక అవకాశము కూడా. ఇది సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపే శక్తి. దేశం కోరేది, సమాజం కోరేది, భవిష్యత్తు కోరేదు చైతన్యవంతమైన యువత. కాబట్టి ప్రతి యువకుడు, యువతి ఎన్నికల్లో చురుకుగా పాల్గొని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసి, సమాజ పురోభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలి.

అక్కి వంశీ గౌడ్
ఫోన్:7670883796

## బిసిల కు 42 శాతం

# రిజర్వేషన్ అమలు చేయాలి

వడ్డెర సంఘం నియోజకవర్గం ఇంచార్జి ఇరగదిండ్ల కృష్ణ.

**దేవరకొండ నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఇరగదిండ్ల కృష్ణ మాట్లాడుతూ బిసి లకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీల రిజర్వేషన్ ప్రకటన రాజకీయ ప్రకంపనలు రేపుతున్నాయి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏం మాత్రం పొంతనలేకుండా పోయింది బిసి సంఘాలు ప్రతిపక్ష పార్టీలు మండిపడుతున్నాయి. బీసీలను నట్టేట ముంచినది ఇది బీసీల పై భవిష్యత్తుపై జరిగిన రాజకీయ కుట్ర అని తెలంగాణలో మొత్తం 12,375



గ్రామపంచాయతీలు ఉండగా బీసీలకు కేవలం2, 175 మాత్రమే కేటాయించారు అని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు .ఎన్నికల సమయంలో 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక కేవలం 17% మాత్రమే ఇచ్చి బీసీలను ద్రోహం చేశారు బీసీ సంఘాలు బీసీ హక్కులపై కత్తి దించితే మేము కత్తి తీసి పోరాడుతాం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఇంటి ముందు ప్రతి వాడ ముందు ప్రతి ఊరిలో ప్రతి గ్రామాలలో సమాధానాలు చెప్పాలి బీసీలకు తీన్మార్ మల్లన్న చెప్పిన మాటలన్నీ నిజాలు నిరూపణ అయితున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీలకు న్యాయం తప్పక జరుగుతాదని నమ్మి మిమ్మల్ని మేము గెలిపిస్తే మమ్మల్ని నిండముంచారు. తెలంగాణలో ఉన్న బీసీలందరూ ఏకంకండి ప్రతి ఊర్లో ప్రతి గ్రామంలో,ప్రతి జిల్లాలో ధర్నా కార్యక్రమాలు చేయాలి అప్పుడే మనకు రావాల్సిన 42 శాతం సాధించుకుంటామని అన్నారు.

## పొలంలో రూ 500 నోట్లను నాటిన రైతన్న.. బీమా పరిహారం రానందుకు నిరసన




**జైపూర్ నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రకృతి విపత్తులు రైతుల నడ్డి విరుస్తున్నాయి. ఆపదలో ఆదుకుంటామని నమ్మబలికే బీమా కంపెనీలు వాస్తవంగా నష్టపోయిన రైతుకు ముఖం చాటేస్తున్నాయి. రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లా, దేవరియ జతన్ గ్రామస్థుడు మల్లారం బావరి ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఆయన తన పొలంలో పత్తి పంట పండించేందుకు బ్యాంకు నుంచి రూ.1 లక్ష రుణం తీసుకున్నారు. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాల వల్ల పత్తి పంట మొత్తం ధ్వంసమైంది. కేవలం రూ.4,000 విలువైన పంట మాత్రమే మిగిలింది.పంట బీమా చేయించాననే ధీమాతో ఆయన బీమా కంపెనీకి సమాచారం ఇచ్చారు. కానీ అధికారులెవరూ ఆయనవైపు చూడలేదు. దీంతో విసుగెత్తిన ఆయన రూ.500 నోట్లను తన పొలంలో నాటారు. ప్రభుత్వ పథకాలు, అధికారుల ఉదాసీనత వల్ల తాను నిరాశకు లోనయ్యానని, తన నిరసనను తెలిపేందుకే కరెన్సీ నోట్లను పొలంలో నాటానని ఆయన చెప్పారు. ఈ వీడియో వైరల్ అవుతున్నది.

## ఎమ్మెల్యే నివాసంలో

# ఆత్మీయ వాతావరణం

టిడబ్ల్యూజెఎఫ్ బాధ్యులకు సాదర స్వాగతం



**వనపర్తి, నవంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి పట్టణంలోని నంది హిల్స్‌లో ఎమ్మెల్యే మేఘా రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) నాయకులు ఎమ్మెల్యే ఆహ్వానంపై హాజరయ్యారు.జిల్లా అధ్యక్షుడు అంబటి స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగవరం రామకృష్ణారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి పవన్ కుమార్, సుజిత్ కుమార్, విష్ణు సాగర్లతో పాటు టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా, పట్టణ స్థాయి పలువురు బాధ్యులు పాల్గొన్నారు.ఎమ్మెల్యే మేఘా రెడ్డికి జర్నలిస్టుల ప్రతినిధులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయగా, ఎమ్మెల్యే వారిని సాదరంగా ఆహ్వానించి ఆప్యాయంగా ముచ్చటించారు.